ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
సోమవారం 09 డిసెంబరు 2024
www.prajaaswaramdaily.com
2 pm

# చెన్నమనేని రమేశ్‌కు రూ. 30 లక్షలు జరిమానా

## ఆయన జర్మనీ పౌరుడేనని తేల్చిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్: వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ కు తెలంగాణ హైకోర్టు షాకిచ్చింది. ఆయన జర్మనీ పౌరుడేనని తేల్చింది. తప్పుడు పత్రాలతో ఎమ్మెల్యేగా గెలిచారని పేర్కొంది. తప్పుడు పత్రాలతో పదిహేనేళ్లుగా కోర్టును తప్పుదోవ పట్టించారంటూ చెన్నమనేనిపై మండిపడింది. ఆయన దాఖలు చేసిన పిటిషన్ ను కొట్టివేసింది. కోర్టును, ప్రజలను తప్పుదోవ పట్టించినందుకు 30 లక్షలు జరిమానా విధించింది. అందులో రూ.25 లక్షలు కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ కు, మిగతా 5 లక్షలు లీగల్ సర్వీసెస్ అథారిటీకి నెల రోజుల్లోపు చెల్లించాలని ఆదేశించింది. చెన్నమనేని రమేశ్ బాబు జర్మన్ పౌరుడని, ఎమ్మెల్యేగా ఆయన ఎన్నిక చెల్లదంటూ కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ కోర్టును ఆశ్రయించారు. 2014లో



బీఆర్ఎస్ పార్టీ తరపున వేములవాడ నియోజకవర్గం నుంచి రమేశ్ బాబు అసెంబ్లీకి పోటీ చేయగా.. కాంగ్రెస్ నుంచి ఆది శ్రీనివాస్ పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆది శ్రీనివాస్ పై 5 వేల ఓట్ల మెజారిటీతో రమేశ్ బాబు గెలుపొందారు. దీనిపై ఆది శ్రీనివాస్ కోర్టుకెక్కారు. రమేశ్ బాబు దాఖలు చేసిన అఫిడవిట్ తప్పుల తడక అని, రమేశ్ బాబుకు జర్మనీ పౌరసత్వం ఉందని ఆరోపించారు. ఈ కారణంగా రమేశ్ బాబు ఎన్నిక చెల్లదని వాదించారు. ఈ కేసు విచారణలో ఉండగానే 2018 లో మరోసారి అసెంబ్లీ ఎన్నికలు జరగగా రమేశ్ బాబు వేములవాడ నుంచి మళ్లీ గెలుపొందారు. తాజాగా ఈ కేసులో తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించింది.





## సభాపర్వం





# తెలంగాణ తల్లి అంటే భావోద్వేగం



హైదరాబాద్: చరిత్ర ఉన్నంత వరకు తెలంగాణ తల్లి నిలిచిపోవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు తెలంగాణ అసెంబ్లీసమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ తల్లికి ఇప్పటి వరకు అధికారిక గుర్తింపు లేదన్నారు. తెలంగాణ తల్లి అంటే భావన కాదు.. నాలుగు కోట్ల ప్రజల భావోద్వేగం.. అలాంటి తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సచివాలయంలో జరుపుకోబోతున్నామన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం తెలంగాణ తల్లి అని సీఎం రేవంత్ అన్నారు.



## సోనియా గాంధీ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు

### మంత్రి కోమటిరెడ్డి

తెలంగాణ తల్లి అంటే దేవతలా కాదు.. మన ఇంట్లో అమ్మలా ఉండాలి.. బీఆర్ఎస్ పార్టీలో అసలు తెలంగాణ పదమే లేదు.. తెలంగాణ తల్లి రూపంపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ కు లేదు అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోనియా గాంధీ లేకుంటే మరో జన్మలో కూడా తెలంగాణ వచ్చేది కాదని అన్నారు. శాసన సభలో ఆయన మాట్లాడారు. ఇది తెలంగాణ రాష్ట్ర ప్రకటన రోజు.. నాలుగు కోట్ల ప్రజల కోరిక తీరిన రోజు అని అభివర్ణించారు. ఈ విషయాన్ని సభలో ప్రతిపక్ష నేత గతంలో స్వయంగా ప్రకటించారని గుర్తుచేశారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజున ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. గత పదేళ్లలో నీళ్లు, నిధులు, నియామకాలు ఏమీ రాలేదని చెప్పారు. అమ్మలాంటి తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకుంటున్న ఈరోజు.. సభకు వచ్చి శుభాకాంక్షలు చెప్పేది పోయి.. బయట నిరసనలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.



# విగ్రహం చుట్టూ రాజకీయం

## మంత్రి సీతక్క

సొంత అజెండాతో తెలంగాణ తల్లి విగ్రహం చుట్టూ రాజకీయాలు చేస్తున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. తమ ప్రభుత్వం రూపొందించిన విగ్రహంలో రాష్ట్ర ప్రజల అస్తిత్వం, ఆత్మగౌరవం, పోరాటం, శ్రమైక జీవనరూపం, ఆశీర్వాదం కలగలిసిన నిండైన రూపముందని చెప్పారు. శాసనసభలో సీతక్క మాట్లాడారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మారుస్తున్నామంటూ బీఆర్ఎస్, బీజేపీ నేతలు మాపై విమర్శలు చేస్తున్నారు. పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్కడైనా అధికారికంగా ఆవిష్కరించారా? కేటీఆర్ సోదరికి దేవతా విగ్రహ రూపాన్ని ఇస్తే ఎలా ఉంటుందో అలా పెట్టుకొని దాన్ని రాష్ట్ర ప్రజలపై రుద్దారు. నేడు మేం తెలంగాణ బిడ్డల అస్తిత్వానికి అనుగుణంగా ఉండేలా విగ్రహాన్ని రూపొందించాం. గుండెల నిండా పాడుకునే 'జయ జయహే తెలంగాణ' పాటను రాష్ట్ర గీతంగా ఏర్పాటుచేయాలనే ఆలోచన గత పాలకులకు రాలేదు. నేడు మేం చేస్తుంటే అడ్డుకుంటున్నారు. ఉద్యమ సమయంలో టీజీ అని.. అధికారంలోకి వచ్చాక టీఎస్ అని మార్చారు. అప్పుడు బీజేపీ మాట్లాడలేదు. పార్టీ పేరులో తెలంగాణ పదాన్ని తొలగించారు. ఇప్పుడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పెట్టిన విగ్రహాన్ని చూస్తుంటే మా అక్కాచెల్లెళ్లను చూసినట్లే ఉంది. తెలంగాణ మహిళలు మట్టి బిడ్డలు.. ఆ శ్రామిక తత్వానికి ప్రతిరూపంగా



రూపొందించాం అని సీతక్క అన్నారు.

## నిధుల సాధనకు కృషి చేయాలి

### మంత్రి పొన్నం



కేంద్రం నుంచి నిధుల సాధనకు అందరం కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. తెలంగాణ రావడానికి కారణం సోనియాగాంధీ అని తెలిపారు. తెలంగాణ చిహ్నంలో మార్పు జరగలేదన్నారు. తెలంగాణ గీతాన్ని రూపొందించి అధికారికంగా ఉపయోగిస్తున్నట్లు వివరించారు. గతంలో ఉన్న విగ్రహాలు పార్టీకి సంబంధించినవని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం ప్రభుత్వపరంగా లేదని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్ర ప్రజల భావోద్వేగాలకు అనుగుణంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఇటీవల వరదలు వస్తే కేంద్రం కేవలం రూ.400 కోట్లు ఇచ్చిందని విమర్శించారు.

## ఎమ్మెల్యేల అభిప్రాయం తీసుకుంటే బాగుండేది : కూనంనేని

సభలో బీఆర్ఎస్ సభ్యులు ఉంటే బాగుండేదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ కోరుకున్నట్లు తెలంగాణ తల్లి రూపం ఉండదన్నారు. కవులు, కళాకారులు, మేధావుల సలహాలు, సూచనల మేరకు రూపొందించినట్లు చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనపై ఎమ్మెల్యేల అభిప్రాయం తీసుకుని ఉంటే బాగుండేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఒక్కొక్కరూ ఒక్కో పాత్ర పోషించారని చెప్పారు. రాజకీయ కోణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని వివాదం చేస్తే చరిత్ర క్షమించదని వ్యాఖ్యానించారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొనాలి. ఈ అంశంపై ఏకాభిప్రాయంతో ఉన్నామని చాటి చెప్పాల్సిన అవసరం ఉంది. టీఆర్ఎస్ను బీఆర్ఎస్ గా మార్చుకోవచ్చు, తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా రూపకల్పన చేస్తే తప్పు జరిగినట్లా? తెలంగాణ తల్లి విగ్రహం కన్నతల్లిలా ఉండాలనేదే ఉద్దేశం అని సాంబశివ రావు అన్నారు.





## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్ట్

హైదరాబాద్: ప్రధాన ప్రతిపక్షం లేకుండానే అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకుని, అరెస్టు చేశారు. అనంతరం కేటీఆర్, కవిత సహా పార్టీ ప్రజాప్రతినిధులను పోలీసు వ్యానుల్లో అక్కడి నుంచి తరలించారు. సోమవారం ఉదయం దీక్షా విజయ్ దివస్ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ అమరులకు నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, అదానీ ఫొటోతో కూడిన టీషర్టులను ధరించి అసెంబ్లీకి బయల్దేరారు. దీంతో అసెంబ్లీ గేటు-2 వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. రేవంత్, అదానీతో కూడిన టీషర్టు ధరించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత నెలకొన్నది.

## బీజేపీ రాజ్యసభ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్య

దిల్లీ: మూడు రాష్ట్రాల్లో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. ఏపీ నుంచి బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు అవకాశం కల్పించింది. గతంలో ఆయన వైసీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికై ఇటీవల రాజీనామా చేశారు. ఆర్.కృష్ణయ్యతో పాటు హరియాణా నుంచి రేఖాశర్మ, ఒడిశా నుంచి సుజిత్‌కుమార్‌ను అభ్యర్థులుగా బీజేపీ ఎంపిక చేసింది.



# గ్రూప్ 2 వాయిదా వేయాలని పిటిషన్

## 15,16న తెలంగాణ గ్రూప్ 2 పరీక్ష

## 16,17న జూనియర్ ఇంజనీర్ ఎగ్జామ్

హైదరాబాద్: గ్రూప్-2 వాయిదా వేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. డిసెంబర్ 15, 16 తేదీల్లో తెలంగాణలో గ్రూప్-2 పరీక్ష, డిసెంబర్ 16, 17 తేదీల్లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ జూనియర్ ఇంజనీర్ పరీక్ష ఉందని అభ్యర్థులు పేర్కొన్నారు. రెండు పరీక్షలు ఉండటంతో గ్రూప్-2 వాయిదా వేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు.